ఆంధ్రప్రభ
Estd 1938
www.prabhanews.com
Journalism first!

● ఎన్నికల్లోనే రాజకీయాలు...

# అందరి మద్దతుతో అభివృద్ధి

## ఓల్డ్ సిటీయే ఒరిజినల్ హైదరాబాద్



● 2034 వరకూ మాదే అధికారం ● హామీలన్నీ నెరవేరుస్తాం ● మధ్యతరగతి కోసమే మెట్రో
● భాగ్యనగర్ రూపురేఖలు మారుస్తాం ● పాతబస్తీ మెట్రో శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
● రేవంత్‌రెడ్డి గట్టి పట్టుదల వ్యక్తి
● అండగా ఉంటాం: అసదుద్దీన్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో:** రాజకీయాలను పక్కనబెట్టి పరిపాలన కొనసాగిస్తేనే అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో లక్ష్యాలను చేరుకోగలమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. మిగతా సమయంలో అభివృద్ధిపైనే మా దృష్టి అంటూ స్పష్టం చేశారు. చారిత్రక నేపథ్యం ఉన్న హైదరాబాద్ మహానగరానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు, అనేక ప్రత్యేకతలు ఉన్నాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ ప్రతిష్టను కాపాడుకుంటూ అన్ని రంగాల్లో సమాన అభి వృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తున్నామన్నారు. మహానగరాభివృద్ధికి 2050 వైబ్రెంట్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశామని, నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో త్వరలోనే అమలు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. 2034 వరకు ఖచ్చితంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. శుక్రవారం పాతబస్తీ మెట్రో రైలు ప్రాజెక్టుకు చాంద్రాయణ గుట్టవద్ద శిలాఫలకం వేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై సీఎం రేవంత్ మాట్లాడుతూ, అందరూ అనుకుంటున్నట్లుగా ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ హైదరాబాద్ సిటీ అంటూ పాతబస్తీ నాయకులు, స్థానిక ప్రజల్లో ➪ 2వ పేజీలో...

ఆంధ్రప్రభ



# అందరి మద్దతుతో అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తేజం నింపారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో నివసించే కుటుంబాలు శంషాబాద్ విమానాశ్రయం వెళ్ళాలంటే సొంత వాహనాలను వినియోగిస్తారని, ఉన్నతశ్రేణి కుటుంబాల కన్నా మధ్య తరగతి ప్రజలు నివసించే ఓల్డ్ సిటీలో మెట్రో సేవలు గరిష్ట స్థాయిలో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. అందుకే జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఓల్డ్ సిటీ మీదుగా శంషాబాద్ మెట్రో కనెక్టివిటీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. చాంద్రాయణగుట్ట వద్ద భారీ జంక్షన్ ఏర్పాటుచేసి నగరం చుట్టూ ఉన్న ప్రజలకు ప్రయాణ సౌలభ్యం, వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. నాలుగేళ్లలో పాతబస్తీ మెట్రో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఎంఐఎం పార్టీ సూచనలు, సలహాలతో పాతబస్తీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ రోడ్ల విస్తరణకు రూ.200 కోట్లు, మీరాలం వంతెన నిర్మాణానికి రూ.360 కోట్లు కేటాయించామని వెల్లడించారు. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు, స్థానిక ఎంపీ, శాసన సభ్యుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే చంచల్‌గూడ జైలును అక్కడి నుంచి తరలిస్తామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఆ స్థానంలో ప్రభుత్వ పాఠశాలను నెలకొల్పి స్థానిక విద్యార్థులకు సౌకర్యంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కులీ కుతుబ్ షాహీ నుంచి నిజాం వరకు నగర అభివృద్ధికి కృషి చేశారని, ఆ ఒరవడిని తాము కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే పదేళ్ళపాటు రాష్ట్రాన్ని ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వమే పాలిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

హైదరాబాద్ నగర ప్రతిష్టను నిలబెట్టడానికే మేం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ప్రతి గల్లీ అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అది ఈ ఐదేళ్ళ ప్రణాళికలో చేసి చూపిస్తామని వెల్లడించారు.

ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు మూసీ రివర్ ఫ్రంట్ లక్ష్యాన్ని పూర్తిచేసి నగర ప్రతిష్టను పెంపొందిస్తామన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే లండన్ థేమ్స్ నగరాన్ని అక్బరుద్దీన్‌తో కలిసి సందర్శించామని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నేతృత్వంలో మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. మైనారిటీల కోసం 4శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని చెప్పుకొచ్చారు.




## రేవంత్ గట్టి పట్టుదల వ్యక్తి

సీఎం రేవంత్ రెడ్డిపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి చాలా మొండి ఘటమని.. పట్టుదలతో ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. అభివృద్ధి విషయంలో, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో రేవంత్‌రెడ్డి గట్టి పట్టుదల గల వ్యక్తి అని, ఐదేళ్ళు ప్రశాంతంగా పనిచేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రజల తీర్పును తాము శిరసా వహిస్తామని అన్నారు. అభివృద్ధిలో సీఎం రేవంత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు కలిసి మెలిసి జీవిస్తున్నారని, కానీ కొన్ని శక్తులు విధ్వంసానికి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అలాంటి శక్తులను అడ్డుకోవాలని అన్నారు. సీఎంను కలవగానే పాతబస్తీ అభివృద్ధికి రూ.120 కోట్లు విడుదల చేశారని, ఓల్డ్ సిటీ డెవలప్‌మెంట్‌కు నిధులు మంజూరు చేసిన రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఒవైసీ ధన్యవాదాలు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రికి కొత్త బిల్డింగ్ నిర్మించాలని కోరారు. చంచల్‌గూడ జైలును ఓల్డ్ సిటీ నుండి తరలించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని తెలిపారు.